తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# ఘనంగా రమజాన్ పర్వదినం

## ఊరేగింపుగా ఈద్గాల వద్దకు



రమజాన్ ప్రార్థనలకు వెళ్తున్న ముస్లిం సోదరులు

కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ముస్లిం సోదరులు రమజాన్ పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఉదయం 9గంటలనుంచే ఈద్గాల వద్దకు ఊరేగింపుగా చేరుకున్నారు. అల్లాహ్ హు అక్బర్ అంటూ చదువుతూ ముందుకుసాగారు. పండగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కుప్పంలో ఉదయం 9గంటలకు లక్ష్మీపురం ఈద్గా, 9.45గంటలకు మోడల్ కాలనీ, 10గంటలకు కొత్తపేట ఈద్గాలలో ఈద్ నమాజులను ఆచరించారు. అలాగే గ్రామీణ ప్రాంతాలైన మల్లానూరు, కంగుంది, మిట్టపల్లి, వానగుట్టపల్లి, మహ్మద్‌పురం, గణేష్‌పురం, నూలుకుంట, చిన్న ఓని తదితర ప్రాంతాల్లో సైతం ఈద్ నమాజులను ముస్లింలు ఆచరించారు. శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాల్లో సైతం ముస్లిం సోదరులు పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు ముగిసిన నేపథ్యంలో రమజాన్ మాసం యొక్క స్ఫూర్తితోనే ఏడాది పాటు ముస్లింలు దైవం పట్ల ఆరాధన, భక్తిభావాలతో, ఐదుపూటల నమాజులు చదువుతూ ముందుకుసాగాలని సూచించారు. కాగా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనల మేరకు కుప్పంలో ముస్లింలు ఈద్ నమాజు సందర్భంగా నల్లటి వస్త్రం చేతికి కట్టుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు కుప్పం పట్టణంలో మైనార్టీ సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు సిఎం చంద్రబాబునాయుడుకు మద్దతుగా ఎప్పుడూ ఉంటారని ముస్లింల సమస్యగా మారిన వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణకు ఏపి ప్రభుత్వం మద్దతు పలకకుండా చూడాలని మైనార్టీ జమాత్ పెద్దలు ఈసందర్భంగా ఆర్టీసీ వైస్‌ఛైర్మన్‌ను కోరారు. విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.

# పెన్షన్లు పంపిణీకి సర్వం సిద్ధం

## - జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, మార్చి 31 ప్రభాతవార్త ః

ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు ఏప్రిల్ 1న ఉదయం 7 గంటల నుంచి లబ్దిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించిన 2,61,841 మంది ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ దారులకు సుమారు 1,11,82 కోట్ల రూపాయలు పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. గత నెలలో ఫించన్ తీసుకోని వారికి ఈ నెల పింఛన్ మొత్తంతో కలిపి పంపిణీ చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారులను, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్ సమాజు

## కిట కిట లాడిన ఈద్‌గాహ్‌లు



ఈదులగుంట ఈద్‌గాహ్‌లో ప్రసంగిస్తున్న ముఫ్తినయిం, హాజరైన భక్తులు

శ్రీకాళహస్తి, మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిపుణ్యక్షేత్రంలో సోమవారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ నమాజును ఆచరించారు. ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో ముఫ్తి నయిం సాహెబ్ రంజాన్ ప్రాధాన్యతను వివరిస్తూ, అల్లాహ్ మనకు ఇచ్చిన మహోన్నత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. మనం నెల రోజుల పాటు ఆచరించిన ఉపవాస దీక్షలకు, చదివిన తరావీహ్ నమాజులకు సంబంధించి రంజాన్ పర్వదినాన అల్లాహ్ ప్రతిఫలం ఇచ్చేరోజు అయితే మనం జనం మెప్పుకోసం, జనం చూడటం కోసం ప్రార్థిస్తున్నాము తప్ప అల్లాహ్‌నుంచి వరాలు పొందటానికి ప్రయత్నించటం లేదన్నారు. మనం ఇక్కడి లాభాలనే పరిగణలోకి తీసుకుంటున్నాము తప్ప పరలోక ఫలితాల గురించి పట్టించుకోవటం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన ఫజాయిల్ ఆమాల్‌కు సంబంధించి వివరిస్తూ నేడు మనం కన్నీరు మున్నీరుగా అల్లాహ్ వద్ద మన తప్పిదాలను, తప్పులను క్షమించమని కోరితే దయాళువు కరుణించి క్షమించే పవిత్ర రోజు రంజాన్ అన్నారు.

**మూడు చోట్ల ఈదుల్ ఫితర్ ప్రార్థనలు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని వేలాది మంది ముస్లింలు భక్తి శ్రద్ధలతో శనివారం మూడు చోట్ల ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరిపారు. రాజీవ్‌నగర్‌లో మౌలానా మహబూబ్‌బాషాసాహెబ్, ఈదుల గుంటలో ముఫ్తినయిం సాహెబ్, అయ్యల నాడుచెరువులో హాఫీజే ఖుర్ అన్ ఈదుల్ ఫితర్ ప్రార్థనలు జరిపారు. ప్రజల్ని దిశ దెశ నిర్దేశం చేసారు. ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో శాసనసభ్యుడు బొజ్జల సుదీర్‌రెడ్డి తరఫున తెలుగుదేశం నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, బషీర్ షాకిర్ అలి, ఖాదర్‌బాషా, జీలాని తదితరులు పాల్గొన్నారు. అలాగే తాము చేసిన అభివృద్ధిని వివరించారు. భక్తులు సోమవారం భారీసంఖ్యలో చుట్టుపక్కల గ్రామాల నుంచికూడా భక్తులు హాజరై ప్రార్థనలు జరిపారు.

# కాణిపాకంలో వేసవి ఉపశమన చర్యలు



ఆలయం వద్ద గ్రీన్ మ్యాట్‌లతో ఏర్పాటు చేసిన చలువ పందిళ్ళు, మాడా వీధుల్లో రోడ్లుపై మ్యాట్‌లను ఏర్పాటు చేసి ట్యాంకర్లు ద్వారా నీటిని చల్లుతున్న సిబ్బంది.

కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయస్వామివారి దేవస్థానంలో ప్రస్తుత వేసవి దృష్ట్యా ఆలయ అధికారులు ముందస్తుగా చేపట్టిన ఉపశమన చర్యలతో భక్తులు సేదతీరుతున్నారు. గత రెండు మూడేళ్ళుగా వేసవిలో భక్తులకు కావలసిన ఉపశమన చర్యల గురించి ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఈఏడాది ఆలయ అధికారులు వేసవి ప్రారంభానికి మునుపే ఎత్తఎత్తున ఉపశమన చర్యలను చేపట్టారు. ప్రతి స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. ఈమేరకు వేసవి దృష్ట్యా భక్తులు ఇబ్బందుల పడకుండా ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయ మాడా వీధుల్లో వేసవి తాపాన్ని తట్టుకునేందుక వీలుగా గ్రీన్ మ్యాట్‌లతో చలువ పందిళ్ళను ఏర్పాటు చేశారు. అలాగే మాడా వీధుల్లో నడవడానికి వీలుగా కూల్ పెయింట్‌ను వేశారు. దీనితో పాటు మాడా వీధులు, ప్రధాన ఆలయం లోపుల కార్పెట్‌లను ఏర్పాటు చేసి ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రతి గంట, రెండు గంటలకు ఒకసారి నీటిని ట్యాంకర్లు, పైపుల ద్వారా స్ప్రే చేస్తున్నారు. ముఖ్యంగా భక్తులు వడదెబ్బ తగలకుండా ఆలయం వెలుపల ఉదయం నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు మజ్జిగను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అలాగే ఆలయం లోపుల క్యూలైన్లు వద్ద ఉక్కబోత లేకుండా భారీ ఫ్యాన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు శుద్ధమైన తాగునీటిని, బాదంపాలు, బిస్కెట్‌లను పంపిణీ చేస్తున్నారు. ఆలయ వద్ద చేపట్టిన వేసవి ఉపశమన చర్యలతో భక్తులు వేసవితాపం లేకుండా సేదతీరుతు న్నారు. ఫిబ్రవరి నెల నుండే ముందస్తుగా చేపట్టిన వేసవి ఉపశమన చర్యలపై భక్తులు ఆలయ అధికారులు ప్రశంసిస్తున్నారు. ఇప్పటికే ఆలయాల్లో భక్తులకు కల్పిస్తున్న వసతులు, దర్శనం త్వరితగతిన జరగడం, ప్రసాదం రుచికరంగా వుండడం అనే మూడు అంశాలపై కాణిపాకం దేవస్థానం మొదటి ర్యాంకు సాధించి రాష్ట్రంలోని ప్రముఖ ఆలయానికే ఆదర్శంగా నిలిచిన విషయం విధితమే. అదే స్ఫూర్తితో ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ అధికా రులు ప్రస్తుత వేసవిలో ఉపశమన చర్యలు చేపట్టి భక్తుల ప్రశంసలందుకుంటున్నారు.

# గరుడునిపై కోదండరాముడు



తిరుపతి(రవాణ), మార్చి 31ప్రభాతవార్త

తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి గరుడ్మంతుని వాహనంగా చేసుకుని కోదండరాముడు భక్తులను అనుగ్రహించాడు. తనకు భక్తులు కానివారు ఆ మాయాదీసులు కాక తప్పదనీ, గరుడ్మంతునిపై విహరించిన స్వామివారిని భక్తులు రామనామ, గోవిందనామస్మరణలతో వేడుకున్నారు. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యత. జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు.

**-ఉదయం మోహినీఅవతారంలో :**

కోదండరామయ్య బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం శృంగారరసాధిదేవతగా మోహినీరూపంలో కోదండరాముడు భక్తులకు అభయమిచ్చాడు. కమనీయమైన శ్రీకాంతునిరూపం జగత్సమ్మోహకంగా కనువిందుచేసింది. ఏనుగులు, అశ్వాలు ముందుకు కదులుతుండగా భక్తుల కోలాటాలు, డ్రమ్స్‌వాయిద్యాలు, ఇతర కళాప్రదర్శనలనడుమ ఊరేగింపు అత్యంత రమణీయంగా జరిగింది. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేశ్ ,భక్తులు పాల్గొన్నారు. ఏప్రిల్ 6నుండి 8వరకు శ్రీరామనవమి ఉత్సవాలు వేడుకగా జరుగనున్నాయి.

# ధర లేక కల్లాల్లోనే ధాన్యం నిల్వలు

## -ధాన్యం కొనుగోలు కేంద్రాలు తక్కువ ధరలకు అమ్ముకోంటున్న రైతులు



వెంకటగిరిరూరల్, మార్చి 31 ప్రభాతవార్త:

గ్రామీణ ప్రాంతాల్లోని అన్నదాతలు ఎండ వాన రాత్రి పగలు తేడా లేకుండా రాత్రి వేళల్లో సైతం సర్పల భారిన తట్టుకోని అధిక వడ్డీలకు అప్పులు చేసి శ్రమించి తీర పండించిన వరి పంట ను నిల్వ చేసుకోని మంచి గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలనే ఆశ ప్రతి రైతుకు ఉన్న ధాన్యంను నిల్వ చేసుకోనేందుకోసం వసతులు పూర్తిగా లేక పోవడంతో కల్లోలో లేక రోడ్డుల పై ధాన్యం ను నిల్వ చేసుకోని మంచి ధరలు వచ్చేవరకు ధాన్యం నిలువ ఉంచలేక అన్నదాతలకు అవగహన లేక దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోంటున్నట్లు అన్నదాతలను ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండాలల్లో వరి పంట రైతులు చేతి వచ్చింది అయితే ప్రభుత్వం ఇంత వరకు దాన్యం కొనుగోలు కేంద్రాలు పై రైతులకు అవగహన లేక పోవడంతో తాము కష్టించి వరి పంటను తక్కువ దరలకు దళారులకు అమ్ముకోంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నరు. బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్న ధాన్యం కు మాత్రం అనుకోన్నత ధరలు లేక పోవడం దారుణం అని అన్నదాతలు వాపోతున్నారు. బయట ప్రాంతలకు చెందిన దళారులు రైతులు పండించిన వరి పంటను పొలాల వద్దనే తక్కువ ధరలకు కొనుగోలు చేసి జోబులు నింపుకోంటున్నరు. అంతే కాకుండా పంట నాణ్యత లేదంటు కోసరులు పేరుతో రైతులను మోసం చేసి దాన్యం దోచుకొంటున్నారు. అంతే కాకుండా రైతులు పండించిన ధాన్యంను నిల్వ చేసుకొనేందుకు మూడు మండలల్లో గుడౌన్లు లేక పోవడంతో వర్షలు వస్తే ధాన్యం చేడిపోతుందనే కారణంగా రైతులు తామ పంటను పోలాల్లోనే దళారులకు అమ్మకోక తప్పడం లేదని అంటున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నతాదికారులు చొరవ తీసుకోని ప్రతి మండలంలో రాయతీలతో దాన్యం నిల్వ చేసుకోనే గుడౌన్‌లును ఎర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగహన కల్పించాలని అన్నదాతలు కోరతున్నారు.

# నేడు ఇంటి వద్దకే సామాజిక పెన్షన్

## - 2.65 లక్షల మంది లబ్దిదారులకు రూ.112.79 కోట్లు పంపిణీ - కలెక్టర్



చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను మంగళవారం ఉదయం 7 గంటల నుండి పెన్షన్‌దారుల ఇళ్ళ వద్దకు వెళ్ళి పెన్షన్ల మొత్తం పంపిణీ జరిగిలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,66,067 మంది పెన్షన్ లబ్దిదారులు వున్నారని, వారికి 112.79 కోట్ల రూపాయల పెన్షన్ మొత్తంను ఏప్రిల్ నెలకు పంపిణీ చేయాల్సివుందన్నారు. మంగళవారం ఒక్కరోజే వంద శాతం పెన్షన్ల పంపిణీకి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ పంపిణీకి నిర్ధేశించిన సిబ్బంది తప్పకుండా మంగళవారం ఉదయం 7 గంటల నుండి పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. పెన్షన్ పంపిణీదారులకు మొదటి నాలుగు గంటల్లోపు పెన్షన్ పంపిణీ పూర్తి అయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పెన్షన్ల పంపిణీలో ఎక్కడా ఏ ఒక్క పొరబాటు జరుగకుండా పెన్షన్ల పంపిణీని పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే గత నెలలో వివిధ రకాల కారణాలతో పెన్షన్ తీసుకోని వారికి ఈ నెలలో మొత్తం పెన్షన్‌ను పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ పంపిణీ సమయంలో లబ్దిదారుడికి ముందుగా నమస్కారం చేసి గౌరవంగా పెన్షన్‌ను పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు పెన్షన్ పంపిణీ కార్యక్రమను పకడ్బందీగా పర్యవేక్షించాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# నాటుబాంబు పేలి వ్యక్తికి తీవ్రగాయాలు



వి.కోట, మార్చి 31 ప్రభాతవార్త

పొలాల వద్ద గడ్డి కోసేందుకు వెళ్లగా దారిలో వన్యప్రాణుల వేటగాళ్లు అమర్చిన నాటు బాంబు పేలడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివంాలిలా.. మండలంలోని తోట కనమ పంచాయతీ కస్తూరినగరంకు చెందిన ఖాదర్ బాషా (42) రమజాన్ పండగ ముగిసిన అనంతరం సాయంత్రం తమ పొలాల వద్దకు పశువుల కోసం గడ్డికై బయలుదేరాడు. మార్గమధ్యంలో కొందరు గుర్తు తెలియని వన్యప్రాణుల వేటగాళ్లు అమర్చిన నాటుబాంబును తెలియకుండా తొక్కేశాడు. దీంతో నాటుబాంబు పేలడంతో అతని కుడికాలు పాదం రెండుగా చీలిపోయింది. కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం 108 ద్వారా కుప్పంకు తరలించారు. కాగా అటవీ అధికారుల నిర్లక్ష్యంతో అటవీ సమీప ప్రాంతాల్లో నాటుబాంబులను అమర్చి వేటగాళ్లు ఆటవిక చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేటగాళ్లపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ చైర్మన్ పగ్గాలు
బిఎంకె రవిచంద్రకే..?
తల్లిదండ్రులపై దాడిచేసిన కొడుకు, కోడలిపై
కేసు నమోదు
గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం
4లో

# మొన్న మద్యం మాఫియా....నేడు యువకుడు దూకుడు

## -అలిపిరి తనిఖీ కేంద్రంలో అలర్టుగా ఉన్నా తప్పిదాలు



తిరుమల, మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:

తిరుమలకు ప్రధాన ప్రవేశద్వారం అలిపిరి తనిఖీ కేంద్రంలో విజిలెన్స్, ఎస్‌పిఎఫ్ భద్రత సిబ్బంది అలర్టుగా ఉంటున్నా ఓ వైపు మద్యం బాటిళ్ళు అక్రమతరలింపు, మరోవైపు మద్యంమత్తులో కొందరు ద్విచక్రవాహనాలపై దూసుకెళ్ళడం జరిగిపోతోంది. అసలు మూడంచెల తనిఖీలు చేస్తున్నా మద్యంమాఫియాగాళ్ళు సినిమాఫక్కీలో మద్యం బాటిళ్ళును తరలించడం ఆశ్చర్యంగా ఉంది. ఓ ముస్లిం యువకుడు సోమవారం రంజాన్ పండుగ రోజే ద్విచక్రవాహనంపై టిటిడి నిబంధనలకు విరుద్దంగా అలిపిరి తనిఖీ కేంద్రంలో విఐపి గేట్‌లో జొరబడటం కొసమెరుపు. ఆ యువకుడిని భద్రత సిబ్బంది ఆపేలోపు గేట్ దాటేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. సాధారణ భక్తుడు..అందునా ముస్లిం యువకుడు ఏకంగా విఐపి గేట్‌లో జొరబడటంతో భద్రత సిబ్బంది నివ్వెరపోయారు. అతను ఎందుకలా చేశాడు, తనిఖీ లేకుండా విఐపి గేట్‌లోనే జొరబడి దూసుకుపోవడంతో ఆందోళన చెందారు. పెద్ద సంచలనంగా మారింది. గతంలో కొండపై ముస్లింలు నమాజ్ చేయడం, అన్యమతస్థులు వారివారి దేవుని చిత్రపటాలతో, బొమ్మలతో తిరుమలకు రావడం జరిగిపోతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం రంజాన్ పండుగరోజు తిరుపతి సింగాలగుంటకు చెందిన ఓ ముస్లిం యువకుడు (36)అలిపిరి తనిఖీ కేంద్రంలో హల్‌చల్ చేశాడు. మద్యం సేవించి ఉన్న అతను ఏకంగా ద్విచక్రవాహనంపై తిరుపతినుండి తిరుమలకు వచ్చేందుకు విఐపి గేట్‌లో జొరబడ్డాడు. అక్కడ విధుల్లో ఉన్న విజిలెన్స్, ఎస్‌పిఎఫ్ సిబ్బంది అతనిని ఆపేందుకు అడ్డుకున్నా ఆగకుండా ద్విచక్రవాహనంపై దూసుకెళ్ళాడు. అంతేగాక అతను తనిఖీ కూడా చేసుకోకుండా మోటారుసైకిల్‌పై వెళ్ళడంతో వెంటనే అప్రమత్తమైన విజిలెన్స్ సిబ్బంది వినాయకుని గుడివద్ద ఉన్న భద్రత సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడ ఉన్న సెక్యూరిటీగార్డు ,కొందరు భక్తులు అతనిని ఆపేందుకు ప్రయత్నించినా ఢీకొని ముందుకు ఘాట్‌లో వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సమాచారం అలిపిరి విజిలెన్స్ సిబ్బంది తిరుమల జిఎన్‌సి టోల్‌గేట్ సిబ్బందికి తెలిపారు. వెంటనే అప్రమత్తమైన తిరుమల విజిలెన్స్ సిబ్బంది ముస్లిం యువకుడిని టోల్‌గేట్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత అతనిని విచారణ చేశారు. మద్యం సేవించి ఉన్నట్లు , పలు రకాలుగా సమాధానం ఇవ్వడంతో పై అధికారుల ఆదేశాలతో అతనిని తిరుపతికి తరలించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలోని మానసిక వార్డుకు తరలించారు. అయితే తాను రంజాన్ వేళ తిరుమలకు వెళ్ళేందుకు ఇలా చేశానని, తాను శ్రీవారిని దర్శించుకోవాలని అనుకున్నానని చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోంది. విజిలెన్స్, అలిపిరి పోలీసులు అతనిని మరింత సమగ్రంగా విచారణ చేస్తేగానీ అసలు విషయం తెలియదని అంటున్నారు. మరోవైపు అతను మానసిక పరిస్థితి బాగోలేదని, మతిస్థిమితం లేనివాడుగా తెలుస్తోందని విజిలెన్స్ సిబ్బంది నిర్ధారించడం మరింత విశేషం.

## నారా భువనమ్మకు స్కోచ్ అవార్డు రావడం హర్షణీయం
– ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరమ్మకు ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని ప్రభుత్వ విప్, కుప్పం తెదేపా సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యూట్రిఫుల్ యాప్ ద్వారా ప్రజలు డైట్, ఆరోగ్యం పట్ల సూచనలు, సలహాలు అందిస్తుండడంతో శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్ట్‌తో పాటు ట్రస్టీ నారా భువనమ్మకు ఈ అవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా ఆయన నారా భువనమ్మకు అభినందనలు తెలిపారు. మున్ముందు మరిన్నిఅవార్డులుఅందుకోవాలనికలియుగదైవంశ్రీవెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## భక్తిభావాలకు ప్రతీక రమజాన్ పండగ
– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త



భక్తిభావాలకు ప్రతీక రమజాన్ పండగ అని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం ఆయన కుప్పంలోని ఈద్గాల వద్దకు చేరుకుని ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. సిఎం చంద్రబాబునాయుడు మైనార్టీల సంక్షేమానికి చర్యలు చేపడుతున్నారన్నారు. మైనార్టీలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సిఎం చంద్రబాబుదేనన్నారు. ముస్లిం సోదరులు పండగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కమతమూరులో ఘనంగా ఉగాది వేడుకలు

కుప్పంరూరల్, మార్చి 31 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం ఉగాది సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కుప్పంలో రెండు రోజుల పాటు ఉగాది పండగ జరుపుకోవడం ఆనవాయితీ. సోమవారం పలువురు మాంసాహార వంటకాలు చేసి బంధుమిత్రులకు విందు ఇచ్చారు. యువత రంగులు చల్లుకుని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. కమతమూరులో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా యువత పోటీ పడి ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకలు

పెనుమూరు, మార్చి 31 ప్రభాతవార్త:

రంజాన్ పండుగ పురస్కరించుకుని పెనుమూరులోని ముస్లీంలు సోమవారం నురానీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ముస్లీంలో పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్ళి గ్రామ పొలిమేరలోని ఈద్గా వద్దకు చేరుకుని రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నూరాని మసీదు ముత్తవల్లీ రఫీ, కరీంఖాన్, రెహమాన్‌లు, మౌజన్ ఇక్రంకరీముల్లా, మహబూబ్‌భాషా, సిరాజ్ భాషా,అజాద్, మున్నా, ఇమ్రాన్, గఫూర్, ఖాదర్‌భాషా, ఇస్మాయిల్, ఆసీఫ్, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

## కలెక్టర్ చెప్పిందేమిటీ!
# క్షేత్ర స్థాయిలో జరుగుతున్నదేంటీ!



యాదమరి, మార్చి 30 ప్రభాతవార్త:

గత ప్రభుత్వం అధికారంలో వున్న ఐదేళ్ళ కాలంలో ఆ రహదారిలో వెళ్ళడానికి నరకం అనుభవించిన ప్రయాణీకులకు రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సత్వరం కొత్త రహదారి నిర్మాణం చేసి ప్రయాణీకుల ఇబ్బందులు తొలగిస్తామని ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి కాశిరాళ్ళ–పరదరామి రోడ్డు పరిస్థితిని వివరించి ఎలాగైనా రోడ్డును నిర్మించాలని చెప్పడంతో స్పందించిన కలెక్టర్ ఉపాధి నిధులు రూ.5.90 కోట్లతో రోడ్డు నిర్మాణానికి పచ్చజెండా ఊపారు. అంతే ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లు వచ్చి రోడ్డు నిర్మాణ పనులకు 2024 డిసెంబర్ 14న భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు మాట్లాడుతూ మూడు నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేసి మాట నిలబెట్టుకుంటామని చెప్పారు. దీంతో కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించగా దీనిపై ప్రత్యేక శ్రద్ద వహించిన కలెక్టర్ ఇప్పటికే ఒకటి రెండు సార్లు వచ్చి రోడ్డు నిర్మాణ స్థితిని చూసి వెళ్ళారు. అయితే కాంట్రాక్టర్ ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి స్థాయిలో చేపట్టడం లేదు. రోడ్డుపై గుంతలు తవ్వి ఆ గుంతల్లో కంకర మాత్రం వేసి వదలివేశాడు. రోడ్లపై వున్న గుంతల్లో వేసిన కంకరకు మూడు, నాలుగు రోజులకు ఒకసారి నీరు పట్టాల్సి వున్నప్పటికీ ఆ పనులను సైతం కాంట్రాక్టర్ చేపట్టడం లేదు. గుంతల్లో కంకర వుండటంతో రోడ్డులో ప్రయాణించే వారిపై దుమ్ము ఎక్కువగా పడుతుంది. ఈ పనులను పర్యవేక్షించి కాంట్రాక్టర్‌తో వేగంగా పనులు చేపట్టాల్సిన ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు కలెక్టర్, ఎమ్మెల్యేలు ఈ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ద చూపుతున్నప్పటికీ ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ మాత్రం పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు పనులను నిలుపుదల చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఉపాధి నిధులతో ప్రారంభించిన అన్ని రోడ్ల నిర్మాణాలు ఓ వైపు పూర్తయి వస్తుంటే సాక్ష్యాత్తు ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ హాజరై భూమి పూజ చేసిన రోడ్డుకు మోక్షం లభించకపోవడంతో సర్వత్రా అసంతృప్తి నెలకొంది. ఈ విషయంపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు ప్రత్యేక శ్రద్ద వహించకుండా మరో ఆరు నెలలు అయినప్పటికీ ఈ రోడ్డు నిర్మాణం జరిగే పరిస్థితి కన్పించడం లేదు.

## ఒక్కరోజులోనే రూ.37లక్షల పన్ను వసూళ్ళు

శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పురపాలకసంఘం కమిషనర్ బియస్ గిరి కుమార్, వారి సిబ్బంది మార్చి టార్గెట్స్ పూర్తి చేయుటకు ఒక్క సోమవారమే రూ.37లక్షలు వసూలు చేసారు.మూడు రోజులుగా కమిషనర్ స్వయంగా తన సిబ్బందితో పెద్ద మొత్తాల్లో బకాయి ఉన్న వారి వద్దకు అంతేకాక అడ్వాన్స్ టాక్సు చెల్లించే వారి వద్దకు వెళ్ళి వారి నుంచి వసూళ్లు చేసారు.సోమవారం సాయంత్రానికి 72శాతం పన్నులు వసూలు చేసారు. ఏడాది లక్ష్యం రూ.9కోట్లు కాగా ఈ ఏడాది రూ.7.07కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది. పన్ను వసూళ్లకు సంబంధించి కమిషనర్ గిరికుమార్,రెవెన్యూ ఆఫీసర్ ఖాదర్‌మొహిద్దీన్,రెవెన్యూ ఇన్స్పెక్టర్ సోమశేఖర్,బిల్ కలెక్టర్లు శరత్,మల్లికార్జున్,బాలాజీ,శరత్‌లు పరుగులు తీసారు.సచివాలయ సిబ్బంది, పురపాలకసంస్థ సిబ్బందితో టీంలుగా ఏర్పాటు చేసి పన్నులు వసూళ్లకు పరుగులు తీయించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సెలవు రోజుల్లో కూడా వసూళ్లు నిర్వహించారు. ప్రభుత్వం వడ్డీ మాఫీ ప్రకటించటంతో మూడురోజుల్లో సుమారు 50లక్షలు వసూళ్లు చేసారు. పెద్దమొత్తాల్లో తేరువీధిలోని ఓ హోటల్‌కు సంబంధించి బకాయి ఉన్న మొత్తం రూ.9.19లక్షలు చెల్లించగా నారాయణ పాఠశాలకు చెందిన వారు రూ.4లక్షలు చెల్లించారు.

## సాధుభద్రేశదాస్ స్వామికి
# సరస్వతీ సమ్మాన్ అవార్డు

తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త



ఢిల్లీ వేదికగా కేకే బిర్లా ఫౌండేషన్ మహామహోపాధ్యాయ సాధు భద్రేష్ దాస్ స్వామికి దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సాహిత్య పురస్కారం సరస్వతీ సమ్మాన్ 2024 అవార్డును ప్రదానం చేసింది.అక్షరధామంకు చెందిన ఆయన భారతీయ తత్వశాస్త్రంతో పాటు ప్రఖ్యాత సంస్కృత పండితుడూ దేవస్థాన కీర్తిప్రతిష్టలు సంపాదించారు.సంస్కృతంలో ఆయన ప్రస్థానత్రయం స్వామినారాయణ సిద్ధాంత సుధ అనే పుస్తకాన్ని రచించినందుకు ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈ అవార్డుతో పాటు రూ.15 లక్షల నగదు బహుమతిని ఆయన అందుకోవడం విశేషం. తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీతో ఆయనకు గత 5 ఏళ్లనుంచి అవినాభవ సంబంధం ఏర్పడింది. ప్రధానంగా అక్షర పురుషోత్తమ దర్శనం పేరుతో పలు జాతీయ సదస్సులు నిర్వహించి సంస్కృతాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆంజనేయస్వామి జన్మస్థలం తిరుమల గిరులే అన్న వాదాన్ని 2021-22లో ఆయన బలపరచిన సందర్భం ఉంది. ఆయనకు జాతీయ సంస్కృత వర్సిటీ మహామహోపాధ్యాయ బిరుదును ప్రదానం చేసింది. అరుదైన ఘనతను సాధించిన ఆయనను వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రత్యేకంగా అభినందించారు.

## తవణంపల్లెలో ఘనంగా రంజాన్ వేడుకలు



తవణంపల్లె, మార్చి 31 ప్రభాతవార్త: రంజాన్ పండుగ పర్వదినాన్ని సోమవారం మండలంలోని ముస్లిం సోదరులు సంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అరగొండ, తవణంపల్లె, తడకర, మత్యం, మైలవారిపల్లె, గాజులపల్లె, కృష్ణాపురం, పొన్నేదుపల్లె, తదితర గ్రామాలలోని ముస్లిం సోదరులు అరగొండ, గాజులపల్లె తదితర గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈమేరకు అరగొండలో ముస్లింలు కొత్తబస్టాండులోని మసీదు వద్ద నుండి జొన్నగురకల రోడ్డు లోని ఈద్గా వరకు ర్యాలీగా అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ఐరాలలో...

ఐరాల, మార్చి 31 ప్రభాతవార్త:

మండల కేంద్రం ఐరాలతో పాటు మోటకంపల్లె తదితర గ్రామాలలో ముస్లింలు ఆయా ప్రాంతాలలోని మసీదులు,ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యంగా ఐరాలలోని మసీదును రంజాన్‌పండుగ సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ప్రతి ఒక్కరూ కొత్త బట్టలు ధరించి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు తెలంగాణా రాష్ట్రం నాగర్ కర్నూల్‌కు చెందిన సురేందర్‌రెడ్డి అనే శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను ఆన్లైన్ ద్వారా విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## మైనర్ పిల్లలే ఇక్కడ ట్రాక్టర్ డ్రైవర్లు



పాలసముద్రం, మార్చి 31 ప్రభాతవార్త: పాలసముద్రం మండలంలో మైనర్ పిల్లలే ట్రాక్టర్లు నడుపుతూ ప్రజలను హడలెత్తిస్తున్నారు. రవాణా శాఖ అధికారులు, పోలీసులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సి వున్నప్పటికీ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు మిన్నంటుతున్నారు. తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దులో పాలసముద్రం మండలం వుండటంతో ఇక్కడి నుండి నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇసుక, మట్టి తదితరాలు ఎక్కువగా అక్రమ రవాణా జరుగుతుంటుంది. ఈ క్రమంలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపోయినప్పటికీ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారిస్తే అక్రమ రవాణకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం వుంటుంది. అయితే కొన్ని ట్రాక్టర్లకు మైనర్ పిల్లలే డ్రైవర్లుగా వుండటం వీరు అక్రమ లోడ్ ఇసుక, మట్టి తదితరాలను తీసుకొని అధికారుల ముందే వెళ్తూ వారికి చెల్లించాల్సిన మామూళ్ళను చెల్లించి వెళ్తుండటంతో ఇది చూసి ప్రజలు ఔరా! అని ముక్కున వేళ్ళు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు మైనర్ పిల్లలు అక్రమంగా ట్రాక్టర్లను నడుపుతూ తీసుకెళ్తున్న ఇసుక లోడ్లను పట్టుకుని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా రంజాన్ ప్రార్థనలు

చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:

ముస్లీంల పవిత్ర రంజాన్ పర్వదినంను పురస్కరించుకుని చిత్తూరు నగర పరిధిలోని ముస్లీంలు సోమవారం గిరింపేట ఈద్గా మైదానంలో రంజాన్ పవిత్ర ప్రార్థనలు నిర్వహించారు. ముస్లీంల పవిత్ర పండుగ రంజాన్ కావడంతో సోమవారం చిత్తూరులో ముస్లీం సోదరులు కోలాహలం స్పష్టంగా కన్పించింది. నగరం మొత్తం గిరింపేటలోని ఈద్గా మైదానం చేరుకుని ప్రార్థనలు నిర్వహించాల్సి వుండటంతో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు ఉదయం 9 గంటల నుండి చిత్తూరు–వేలూరు రోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. ముస్లీంల రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పక్కా చర్యలు తీసుకున్నారు. ఈద్గాలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు పూర్తయిన అనంతరం ముస్లీంలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## వైభవంగా రంజాన్ వేడుకలు

కల్లూరు, మార్చి 31, ప్రభాతవార్త

పులిచెర్ల మండలంలో సోమవారం ముస్లింలు రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని కల్లూరు, మంగళంపేట, పులిచెర్ల, తురక పేట, గడ్డంవారిపల్లి, ఎల్లంకివారిపల్లి, ఎర్ర పాపిరెడ్డిగారిపల్లి, చిట్టారెడ్డిపేటలో ఈద్గాల వద్ద ప్రార్థన చేశారు. ఒకరికొకరు ఆ లింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

## ద్రవిడ వర్సిటీ మాజీ విసి ఆచార్య తుమ్మల రామకృష్ణ మృతి

కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త



ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఈయన గతకొంతకాలంగా తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆచార్య తుమ్మల రామకృష్ణ 2019–22సం॥ల మధ్య ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేశారు. అంతకుముందు ఈయన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో తెలుగు విభాగం ప్రొఫెసర్‌గా ఉండేవారు. చిత్తూరు జిల్లా సోమల మండలంకు ఈయన చెందిన వారు. కాగా ఆచార్య రామకృష్ణ తెలుగుభాషాభిమాని. ఈయన తెలుగులో ఎన్నో గ్రంథాలు, వ్యాసాలు, రచనలు చేశారు. పలు అంతర్జాతీయ సదస్సుల్లో జర్నల్స్‌ల్లో ఈయన ప్రచురణలు ముద్రితమయ్యాయి. ఆచార్య తుమ్మల రామకృష్ణ మృతి తెలుగుసాహితీ లోకానికి తీరనిలోటుగానే భావించాలి.

## ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి

పూతలపట్టు, మార్చి 31, ప్రభాతవార్త

మొలకలచెరువు మండలం దేవలచెరువు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తూరు ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ సోమవారం హైదరాబాదులోని ఇమేజ్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ సోమవారం మృతిమృతి చెందారు. ఆయన ఆత్మ శాంతించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూతలపట్టు పాఠశాలలో సిబ్బంది, మండల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ నేతాజీ పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆకస్మిక మరణం విద్యాశాఖకు తీరని లోటన్నారు. పాఠశాల సిబ్బంది లోకనాథ్ రెడ్డి నాదముని, సురేందర్ రెడ్డి రామిరెడ్డి, సుబ్రహ్మణ్యం మండలఉపాధ్యాయులురెడ్డప్పనాయుడు,సుబ్రహ్మణ్యం మొదలగు వారు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

## గ్రామాల్లో బెల్టుషాపుల చిచ్చు-ఒకరికి తీవ్రగాయాలు

.తొట్టంబేడు, మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఎక్సైజ్ అధికారుల తీరుతో ఓ నిండు ప్రాణం ప్రాణాపాయ స్థితిలో ఉంది. పచ్చని పల్లెల్లో బెల్టుషాపులు దుమ్ములేపుతున్నాయి. ఓవైపు పట్టణంలో రాత్రి 10వరకు మద్యం దుకాణాలు, మరోవైపు రాత్రి 11 వరకు బార్లు బార్ల తెరచుకోగా గ్రామాల్లో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. వీటికి తోడు పక్కనే తాగేందుకు పర్మిట్‌రూంలు లక్షలు పెట్టి తెచ్చుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు ప్రతి నిత్యం ఆ మద్యం దుకాణం నుంచి చుట్టుపక్కల గ్రామాల్లోని బెల్టుషాపులకు యదేచ్ఛగా మద్యం సరఫరా చేయడంతో వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. అయితే మద్యం తాగిన ఓవ్యక్తి నిండు ప్రాణం ఆస్పత్రి పాలయ్యింది. వివరాల్లోకి వెళితే చేమూరు గ్రామం వద్ద గ్రామస్తులు మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని వేడుకున్నా వినకుండా అధికారులు మద్యం షాపు యజమాని కలసి అక్కడే మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసి అందులోని పర్మిట్‌రూంను ఏర్పాటు చేశారు. ఈమద్యం దుకాణం నుంచి ప్రతి నిత్యం సరఫరా అవుతుంది. ఇందులో భాగంగా కాసరంలో రెండు రోజుల క్రితం ఓవ్యక్తి బెల్టుషాపులో పూటుగా మద్యం సేవించిపక్కనే ఉన్న పందిరి కింద పడిపోగా గ్రామంలో కుక్కలు అతన్ని కరచి శరీరంపై గాయాలయ్యే విధంగా ముఖం మరియు కాళ్ళపై కొరికివేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. కుటుంబసభ్యులు ఎంతసేపటికి రాకపోవడంతో గ్రామంలో వెతకగా అతను బెల్టుషాపులో పక్కనే రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో గమినించిన కుటుంబసభుయలు హుటాహుటినతిరుపతిలోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించిచికిత్స అందిస్తున్నారు. ఈవిషయమై గ్రామంలో దుమారంరేపింది.ఎక్సైజ్‌అధికారులతీరువల్లేపచ్చనిపల్లెల్లోమద్యం ఏరులై పారుతోందని విరుచుకుపడుతున్నారు. ఇకనైనా పోలీసులు, ఎక్సైజ్‌శాఖ చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వైకాపా ఎస్‌సిసెల్ అధ్యక్షుని నియామకం

శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎస్ సి సెల్ అధ్యక్షులుగా పసల కృష్ణయ్యను నామినేట్ చేస్తూ స్థానిక వైకాపా నాయకుడు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు ఆయన పేరును అధిష్టానానికి పంపి నియమింపజేసారు.పార్టీ అధికారంలో ఉన్నపుడు తనకు తోడు నీడగా నడచిన వారిలో పసల కృష్ణయ్య ఉన్నారు. ఆయన గతంలో మున్సిపల్ ఉద్యోగిగా పని చేసారు. ఆయనకు నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా నియమించారు. పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మహిళ ఆత్మహత్య



చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో టెలిఫోన్‌కాలనీకి చెందిన కె.హేమావతి(52) సోమవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందింది. టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య వెల్లడించిన వివరాల మేరకు టెలిఫోన్‌కాలనీలో కె.సోమశేఖర్, కె.హేమావతి దంపతులు వుండేవారు. ఈ క్రమంలో హేమావతికి గత రెండేళ్ళుగా మైగ్రేన్ తలనొప్పి వస్తుండటంతో తీవ్రంగా బాధపడుతుండేదన్నారు. ఈమె వేలూరు సిఎంసి ఆసుపత్రి, చిత్తూరులోని పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుందన్నారు. అయితే హేమావతికి మైగ్రేన్ తలనొప్పి తగ్గలేదని, ఆమెకు అంతకు ముందు గర్భాశయం, అపెండిక్స్, కుటుంబ నియంత్రణ, పైల్స్ తొలగింపు కోసం ఆపరేషన్లు చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో ఆమెకు మైగ్రేన్ తలనొప్పి అధికం కావడంతో తట్టుకోలేక గ్రిల్ రాడ్‌లోని పైకప్పుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. ఉరి వేసుకున్న హేమవతిని చికిత్స నిమిత్తం ఉరి విప్పి చిత్తూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వర్తించి డాక్టర్లు ఆమె కుటుంబసభ్యులకు మృతదేహం అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య తెలిపారు.

## మానవాళిలో హితాన్ని ప్రేరేపించేది రంజాన్

చౌడేపల్లి, మార్చి 31 ప్రభాతవార్త



మానవాళిలో హితాన్ని ఆకాంక్షించే రంజాన్ పండు గను మండల వ్యా ప్తంగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మేదరదొడ్డి, సంతగేటుల జుమియా, షాకీర్ మసీదుల ముస్లిం సోదరులు ర్యాలీగా చెడుగుట్లపల్లి రోడ్డువైపు వున్న ఈద్గా వద్దకు చేరుకొన్నారు. అక్కడ మత పెద్దల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకొన్నారు. అదే విధంగా దాదేపల్లి, ఖాన్‌సాబ్‌మిట్ట, బుటకపల్లి, ఎ.కొత్తకోట, కోటూరు, అంకుతోటపల్లి, మర్రిమాకులపల్లి, కాగతి, లద్దిగం తదితర గ్రామాల్లోనూ ముస్లిం సోదరులు ఈద్గా, మసీదుల్లో ప్రార్థనలు చేసారు. హిందూ–ముస్లింల సఖ్యతను చాటుతూ సహపంక్తి భోజనాలు చేసారు.

## డివైఇఓ చంద్రశేఖర్ మృతి

చిత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త:



ఇన్‌ఛార్జ్ చిత్తూరు డివైఇఓ, పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ జి.చంద్రశేఖర్ సోమవారం తెల్లవారుజాము అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. చిత్తూరు ఇన్‌ఛార్జ్ డివైఇఓగా విధులు నిర్వహిస్తున్న జి.చంద్రశేఖర్ గత కొంతకాలంగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడు తున్నారు. ఈ మేరకు ఆయన హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటున్నారు. గత పదిహేను రోజుల క్రితం ఊపిరితిత్తుల వ్యాధి తీవ్రం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాదు వెళ్ళి చికిత్స చేసుకుంటుకుని తిరిగి చిత్తూరు వచ్చారు. రెండు రోజుల క్రితం మళ్ళీ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో చికిత్స కోసం వెళ్ళిన డివైఇఓ ఆసుపత్రిలోనే చికిత్స పొందుతూ మృతి చెందారు. డివైఇఓ జి.చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో జిల్లా విద్యాశాఖ అధికారి, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

## గంగమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి రోజాక్షి

బోయకొండ(చౌడేపల్లి), మార్చి 31 ప్రభాతవార్త



శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రోజాక్షి దర్శించుకొన్నారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం న్యాయమూర్తి కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మండపంలో వేదాశీర్వాదరం పవిత్ర తీర్థ ప్రసాదాలు, మెమొంటోనందించి సత్కరించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## గజ్జలవారిపల్లిలో పాలేటమ్మ జాతర



చౌడేపల్లి, మార్చి 31 ప్రభాతవార్త

మండలంలోని కాగతి పంచాయతీ గజ్జలవారిపల్లిలో పాలేటమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. పగలంతా గ్రామంలో భక్తులచే పూజలందుకొన్న గ్రామదేవత పాలేటమ్మ రాత్రి వీదుల్లో ఊరేగింది. గజ్జలవారిపల్లి, పెద్దూరు, మర్రిమాకులపల్లి, కురపల్లిల్లో అమ్మవారు ప్రతి ఇంటినుంచి పూజలందుకొన్నారు. పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ప్రవీణ్ పగడాల మృతికి సంతాప ప్రార్థనలు

చౌడేపల్లి, మార్చి 31 ప్రభాతవార్త



ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి క్రైస్తవ సోదరులు ప్రత్యేక సంతాప ప్రార్థనలు చేసారు. చౌడేపల్లి, లద్దిగం సిఎస్ఐ చర్చిల్లో ఫాదర్ రేవ.నోయల్ విజయ్ భూషణ్‌తోపాటు సంఘ కార్యదర్శులు ప్రసాద్‌బాబు, లాజర్‌ల ఆధ్వర్యంలో సభ్యులు ఆయన ఆత్మకు శాంతి కలగాలని యేసు ప్రభువును ప్రార్థించారు.

## రూ.2కోట్లతో టుటౌన్ పోలీస్‌స్టేషన్ సిద్ధం
–ఎస్పీగారు ప్రారంభించండి..

తొట్టంబేడు, మార్చి 30 ప్రభాతవార్త




గత కొన్ని ఏళ్ళ తరబడి అద్దెభవనంలో నడుస్తున్న టుటౌన్ పోలీస్‌స్టేషన్‌కు మోక్షం వచ్చింది. తొలుత టుటౌన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసినపుడు భారత్‌గ్యాస్ గోడౌన్ సమీపంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఇక్కడ నుంచి టుటౌన్ పోలీస్‌స్టేషన్‌ను బసవయ్య పాళెం సర్కిల్ వద్ద ఓఅద్దెభవనంలో ఏర్పాటుచేశారు. టుటౌన్ పరిధిలో ఇటు కొన్ని తొట్టంబేడు మండలానికి చెందిన గ్రామాలు, మరియు టౌన్ పరిధిని ఏర్పాటు చేశారు. అయితే పట్టణ పరిధి పెరడంతో అటు పట్టణం, ఇటు తొట్టంబేడు గ్రామాలను టుటౌన్ పరిధిలోకి చేర్చారు. కానీ పట్టణ పరిధిలో ఉన్న వార్డులను మాత్రమే చేర్చితే సరిపోతుందని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం నూతన టుటౌన్ పోలీస్‌స్టేషన్‌భవనాన్ని తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఖాళీ ప్రదేశంలో సుమారు రూ.2కోట్లతో కొత్త భవనాన్ని రెండతస్తులుగా నిర్మించారు. ఈ భవనం నిర్మాణం పూర్తయింది. ఇక ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే టుటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఇక్కడకు మార్చవచ్చును. అందరికీ అందుబాటులో ఉంటుంది. ఇక తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌కు స్థలాన్ని కేటాయించినా నిధులు విడుదల కాలేదు. ఇక డిఎస్పీ కార్యాలయం కూడా శ్రీరాంనగర్ కాలనీలోఏళ్ళ తరబడి అద్దెభవనంలోనే నడుస్తోంది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించి టుటౌన్ పోలీస్‌స్టేషన్ ప్రారంభించడంతో పాటు తొట్టంబేడు, డిఎస్పీ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాల్సి ఉంది. ఈదిశగా ఎస్పీ చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక టుటౌన్ పరిధిలో పట్టణంలోని వార్డులను మాత్రమే ఉండాల్సిందిగా పలువురు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## కృష్ణయాదవ్ సేవానిరతి

-పుట్టినరోజున పేదలకు అన్నదానం




**తిరుపతి,మార్చి 31ప్రభాతవార్త:**
టిడిపి రాష్ట్రనాయకుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బిజి కృష్ణయాదవ్ పుట్టినరోజున పేదల ఆకలితీర్చేలా అన్నదానం చేయడం సేవానిరతిని చాటుకున్నాడు. సోమవారం ఆయన పుట్టినరోజున తిమ్మినాయుడుపాళెంలో టిడిపి ఇన్‌చార్జి ఎం.సుగుణమ్మ, యాదవసంఘం చైర్మన్ నరసింహయాదవ్, రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతియాదవ్, దంపూరి భాస్కర్‌యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ, టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ బి.ఆనందబాబుయాదవ్, ,మునిశేఖర్‌రాయల్ పాల్గొని కృష్ణయాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. యాదవసంఘం టిడిపితోనే ఉంటుందని, వారికి దేవుని ఆశీస్సులు కలగాలని ఆకాంక్షించారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌ని సన్మానించిన టీడీపీ నేతలు

**విజయపురం, మార్చి 31 ప్రభాతవార్త:**



ఇటీవల నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన రాజమ్మ సుబ్రహ్మణ్యంరాజు దంపతులను సోమవారం మండల టీడీపీ నాయకులు శాలువలతో, పూలమాలతో మహారాజపురంలో ఘనంగా సన్మానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి చేసిన సేవకు తగిన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు కపిల్, సెల్వం, ఆర్ముగంరెడ్డి, శ్యాము వేలు తదితరులు పాల్గొన్నారు.

## బూచివానత్తంలో పైపులైన్ పనులు

**విజయపురం, మార్చి 31 ప్రభాతవార్త:**



మండలంలోని బూచివానత్తంలో పైపులైన్‌పనులు జోరుగా జరుగుతున్నాయి. వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా సర్పంచ్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ ముందస్తుగా ఒవర్‌హెడ్ ట్యాంకు నుంచి అంకమ్మ కాలనీ వరకు పైపులైన్ వేశారు. బూచివానత్తంలో కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మండలంలోని కోసలనగరంలో నాలుగు రోజుల పాటు తాగునీటి సమస్య చోటు చేసుకుంటున్న గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు వీధుల్లో నీరు సక్రమంగా రాకపోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏపీ పీజీసెట్ ధరఖాస్తులకు ఆహ్వానం

**తిరుపతి విద్య, మార్చి 31 ప్రభాతవార్త**



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వర్సిటీలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి పలు పీజీ కోర్సులలో ప్రవేశాలకు సంబంధించిన నిర్వహించే ఏపీపీజీసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి పీజీసెట్ 2025 నిర్వహణను ఎస్వీయూకు అప్పగించిన నేపథ్యంలో పీజీసెట్ను నిర్వహణపై దృష్టి సారించామన్నారు. బుధవారం నుంచి ఆన్లైన్ దరఖాస్తులు ప్రారంభం కానున్నాయని, దరఖాస్తులకు తుది గడువు ఏప్రిల్ 30 తో ముగుస్తుందన్నారు. సుమారు 153 పీజీ కోర్సులకు 31 ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు.

## రాష్ట్ర వైసీపీ ఎస్సీసెల్ కార్యదర్శి గురునాథంకు ఘన సన్మానం

**బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 31 ప్రభాతవార్త:**



రాష్ట్ర వైసీపీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన ఉగ్గుమూడి గురునాథంకు మండల పార్టీ అధ్యక్షుడు కొణతనేని మణినాయుడు ఆధ్వర్యంలో సన్మానసభ నిర్వహించారు. బుచ్చినాయుడు కండ్రిగ, వరదయ్యపాళెం మండలానికి చెందిన వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూక తోటి రాజేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వేలూరి రాకేష్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్, వేలూరి రాకేష్ మాట్లాడుతూ ఎస్సీ సెల్ లీడర్‌గా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని 20 సంవత్సరాలుపైగా రాజకీయాల్లో పని చేస్తున్న నాయకులు ఉగ్గుమడి గురునాథమని పేర్కొన్నారు. గురునాథం మాట్లాడుతూ పార్టీ అధిష్టానం పెద్దలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుని నిరంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ నాకు ఈ అవకాశం రావడానికి సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు పార్టీకి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో బీరేంద్రరాజు, భానుప్రకాష్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, తిలక్ బాబు, దామోధర్‌రెడ్డి, చిన్న, మహేంద్ర, వినోద్, భాస్కర్, ఎంటెక్ బాబు, మండల నాయకులు వైస్ ఎంపీపీ బాబురెడ్డి, మాజీ ఎంపీపీ మాణికల వెంకటమ్మ, సీనియర్ నాయకులు సాయి నాయుడు, కోటేశ్వరరావు, జయచంద్రనాయుడు, మాజీ సర్పంచ్ గురవయ్య, ప్రసాద్ పాల్, బి.దశకుమార్, వెంకటాద్రి, దినకర్ బాబు, కృష్ణయ్య, చంద్ర, కేశవులు, కిరణ్ యాదవ్, కార్యకర్తలు, యువ నాయకులు పాల్గొన్నారు.

## రాస్ సేవలకు ఉగాది పురస్కారం -2025

**తిరుపతి హెల్త్, మార్చి 31 ప్రభాతవార్త ః**



ఏపీ రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి జిల్లా టూరిజం, సాంస్కృతిక కౌన్సిల్ తిరుపతి వారి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కారం -2025ని సేవా రంగంలో విశిష్టమైన సేవలను గుర్తించి రాష్ట్రీయ సేవా సమితి (రాస్) చేస్తున్న సేవలకుగాను ఉగాది పురస్కారం-2025 అందించారు. కచ్చపీలో ఏర్పాటు చేసిన పురస్కాల సందడిలో రాస్ సేవలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ,జేసీ శుభం బన్సల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం, సంయుక్త కార్యదర్శి మమత ఏపీ టూరిజం అథారిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్, రాస్ లబ్దిదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వృత్తిలో జవాబుదారి తనం ఎంతో అవసరం

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త**



మనం ఏ పని చేస్తున్నామన్నది ప్రధానం కాదు. మనం పని చేసే వృత్తిలో ఎంత జవాబుదారి తనంతో పని చేస్తున్నామన్నది ముఖ్యమని శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జమేదార్‌గా పని చేసి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన మైనంపాటి భద్రయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఇఓ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ సర్వసాధారణమని అయితే శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో పని చేయటం ఓ పూర్వజన్మసుకృతంగా భావించాలని వివరించారు. ప్రతిరోజూ స్వామి అమ్మవార్లను దర్శించుకునే భాగ్యం కల్గిందని భావించాలన్నారు. భద్రయ్య చేసింది చిరుద్యోగమే అయినా ఎంతో జవాబుదారి తనంతో కూడుకున్నదన్నారు.ఆయన సర్వీసులో ఎంతో ఉన్నతంగా వ్యవహరించినట్లు ఆయన సర్వీసు రికార్డులను చూస్తే తెలుస్తుందని వివరించారు.ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. భద్రయ్య దంపతులకు స్వామి అమ్మవార్ల చిత్రపటంతో పాటు తీర్ధ ప్రసాదాలు అందించారు.

## శివయ్య సేవలో పాట్న జడ్జి

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిట కిట లాడింది. అలాగే విఐపిలు కూడా భారీ సంఖ్యలో హాజరయ్యారు. వారికి దర్శనం ఏర్పాటులో అధికారులు సతమతమయ్యారు.పాట్న హైకోర్టు జడ్జి అన్ని అభిషేక్‌రెడ్డి కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి పిఆర్ఓ రవి స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల తీర్ధ ప్రసాదాలను అందించారు.ఏర్పాట్లను ఆలయ ఇనెస్పెక్టర్ హరియాదవ్ పర్యవేక్షించారు.

## మైనార్టీ సోదరులకు మిఠాయిల పంపిణీ

**రేణిగుంట మార్చి 31 ప్రభాతవార్త**



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం రేణిగుంట ఈద్గా మైదానం వద్ద నమాజ్ కు వచ్చిన మైనార్టీ సోదరులకు టిడిపి నేతలు మిఠాయిలు, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఐటీ మంత్రి నారా లోకేష్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు.కార్యక్రమంలో రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, టిడిపి మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, టిడిపి నేత వడ్డెర సంఘం రాష్ట్ర ఉప కార్యదర్శి దేవెళ్ళ రమణ, తూకివాకంమాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్,నాగేశ్వరరావు, సిటీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గంగమ్మగుడి వద్ద అన్నదానం

**రేణిగుంట మార్చి 31 ప్రభాతవార్త**



శ్రీ గంగమ్మ గుడి శాశ్వత ధర్మకర్త గుడి చైర్మన్ సోలా మల్లికార్జున్ రెడ్డి జన్మదిన సందర్భంగా సోమవారం గంగమ్మ గుడి వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మల్లికార్జున్ రెడ్డి శ్రీ గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం దాదాపు 2000 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. పలువురు ఆయన అభిమానులు, పుర ప్రముఖులు వివిధ పార్టీల నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు.మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, రాష్ట్ర వడ్డెర సంఘం ఉప కార్యదర్శి దేవెళ్ళ రమణ, మల్లికార్జున్ రెడ్డి మిత్రులు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈదుల్ ఫితర్ వేడుకలు

**పాకాల, మార్చి 31, ప్రభాతవార్త**



పాకాల మండలంలోని పాకాల, దామల చెరువు, మొగరాల, రమణయ్యకి పల్లె, పదిపుట్ల బైలు, సోమవారం మండలంలోని ముస్లిం సోదరులు తాము భక్తి శ్రద్దలతో కఠోర నియమని బంధనలతో 30రోజుల పాటు ఉపవాస దీక్షలు పాటించి చివరి రోజు తాము చేసిన ప్రార్థనలకు అల్లాహ్ వరాలిచ్చే పవిత్ర రోజే ఈ రంజాన్. నెల రోజుల పాటు దివ్య ఖురాన్ అన్ను పఠించి తాము తెలిసి తెలియక చేసిన తప్పులను క్షమించమని వేడుకునే దివ్య దినం రంజాన్. కుల మతాలకు అతీతంగా స్థానిక ఈద్గాల వద్ద నియమనిష్టలతో ఉపవాసదీక్షలు పాటించిన వారికి నేడు రంజాన్ ఈదుల్ ఫితర్ ప్రార్థనల సందర్భంగా వారి భక్తి ప్రవర్తులకు భగవంతుడు వరాలిచ్చే సుదినం ఈ రంజాన్ పండుగ పర్వదినాన్ని పాకాల మండలంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

## ముస్లింలకు బిజెపి నాయకులు రంజాన్ శుభాకాంక్షలు

**తిరుపతి(రవాణ),మార్చి 31ప్రభాతవార్త**




రంజాన్ పండుగతో సోమవారం ఉదయం బిజెపి నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు,హిందువులు స్నేహంతో, కుటుంబంలా జీవించాలన్నారు. ఐక్యతతో మెలగాలన్నారు. బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సామంచి శ్రీనివాస్, మల్లారపు రవిప్రసాద్, రహమాన్,అబ్దుల్‌రజాక, జయంతికుమార్, చాంద్‌బాషా, అబ్దుల్, మస్తాన్,అక్రమ్ తదితరులకు రంజాన్ విందు ఇచ్చారు

## తిరుపతి రైల్వే కమిటీ సభ్యులుగా హర్షవర్ధన్, వైఎస్ బాబు

**తిరుపతి(రవాణ),మార్చి 31ప్రభాతవార్త**




తిరుపతి రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ (ఎస్‌సిసి) సభ్యులుగా ఎన్‌బి హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు దక్షిణమధ్యరైల్వే గుంతకల్లు డివిజన్ అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ ధనంజయకుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. వీరిద్దరూ ఈ పదవిలో రెండేళ్ళపాటు ఉంటారు. వీరు రైల్వేస్టేషన్ సేవలు మెరుగపరడానికి, ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తారు

## యుద్ధప్రాతిపదికన "షాధీమహల్"

టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్



***చంద్రగిరి, మార్చి 31 ప్రభాతవార్త:*** చంద్రగిరిలో ముస్లీమ్ సోదరుల కోసం షాధీమహల్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయనున్నట్లు ఎంఎల్ఏ తనయుడు, టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆయన చంద్రగిరి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్ధనలకు హాజరయ్యారు. ఆయనకు టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా ఆధ్వర్యంలో ముస్లీమ్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30 రోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షను ఆచరించడం పట్ల ప్రశంసించారు. నా తండ్రి పులివర్తి నానిని పార్టీలకతీతంగా ఆధరించిన మీరు సాయం కోసం వస్తే తప్పక సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తెలుగుయువత మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, నాయకులు సక్కుర్ ధనంజయ రెడ్డి, మన్సూర్, మండలం లోకేష్ రాయల్, లోక, మునిరత్నం రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్షలు

వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**చంద్రగిరి, మార్చి 31 ప్రభాతవార్త:**



భక్తిశ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న ముస్లీమ్ సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం చంద్రగిరి ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్ధనలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మస్తాన్ ఆధ్వర్యంలో ముస్లీమ్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మానవాళికి హితాన్ని భోధిస్తుందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి కుటుంబం కలసి జరుపుకునే ఈ పండుగ రోజున ప్రతి ముస్లీమ్ సోదరుడికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డి గారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవరెడ్డి, మండల కోఅప్షన్ సభ్యుడు ఔరంగజేబు, వైసిపి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, యారాశి చంద్రశేఖర్ రెడ్డి, బాహర్, పాకాల చరణ్ రెడ్డి, కొత్తపాటి హరి, సిద్ధిఖ్ భాషా, సూరి, తదితరులు పాల్గొన్నారు.

## రుద్రకోటిని సన్మానించిన తులసీదాస్

**తిరుపతి,మార్చి 31ప్రభాతవార్త:**



రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివను తిరుపతి టిడిపి శాలివాహన అధ్యక్షుడు ఆముదాల తులసీదాస్ కలిశారు. తెలుగు నూతనసంవత్సరంశుభాకాంక్షలు తెలిపి, దుశ్శాలువతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో శాలివాహన నాయకులు హరిప్రసాద్, నరేశ్, కృష్ణ, లోకనాథం, చిరంజీవి పాల్గొన్నారు.

## రేపటి నుంచి డీడీఈ పరీక్షలు

**తిరుపతి విద్య మార్చి 31 ప్రభాత వార్త**

ఎస్వీయూ పరిధిలో దూరవిద్య పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలో 43 పరీక్షా కేంద్రాలను.పలు రాష్ట్రాలలో 8కిపైగా స్టడీ సెంటర్ల పరిధిలో యూజీ, పీజీ పరీక్షలు నిర్వహించనున్నారు. సుమారు 32 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

# తిరుపతి డివిజన్

## ముస్లిమ్‌లకు అండగా వుంటా : విజయ్‌బాబు

**పుత్తూరు, మార్చి 31 ప్రభాతవార్త :**



రంజాన్ పండుగ సందర్భంగా మునిసిపాలిటీలోని చినరాజుకుప్పంలో ముస్లిమ్ మహిళలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధార్మిక చింతన, ధాత్రుత్వం కలయితే రంజాన్ పండుగను ముస్లిమ్‌లంతా జరుపుకోవాలని ఆకాంక్షించారు. నగరి నియోజకవర్గంలోని ముస్లిమ్‌లందరికీ అండగా వుంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, నాయకులు దాసరి విజయ్‌చౌదరి, కుమార్‌రెడ్డి, పరంధామ్, మణికంఠ, అజయ్ చౌదరి, గిరి నాయుడు, పోతుగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చిగురువాడలో స్వర్ణముఖి నదీ ఆక్రమణకు యత్నం

- అడ్డుకున్న రెవెన్యూ, పోలీసులు



***తిరుపతిరూరల్, మార్చి31 ప్రభాతవార్త:*** తిరుపతిరూరల్ మండలంలో భూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఖాళీ స్థలం కనబడితే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. తాజాగా తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీలో సర్వేనెంబర్ 285/7లో ఉన్న 5.45 ఎకరాల స్థలంలో గుడిసెలు వేయటానికి ప్రయత్నించారు. చిగురువాడ గ్రామ పంచాయతికి చెందిన వైయస్సార్ కాలనీ, గంగనగుంట, కొత్తూరు, ఎగువ, దిగువ పల్లికి చెందిన కొందరు నదీ పరివాహక ప్రాంతాన్ని ఆక్రమించి, గుడిసెలు వేయటానికి ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ యంత్రాంగం, పోలీసు సహకారం గుడిసెల యత్నానికి భగ్నం కలిగించారు. 1980లో మల్లీశ్వరరెడ్డి అనే వ్యక్తికి 5ఎకరాల స్థలాన్ని సెటిల్‌మెంట్ పట్టా ఇచ్చినట్టు సమాచారం. అప్పటి నుండి 2010 వరకు సెటిల్‌మెంట్ పట్టా భూములు రిజిస్ట్రేషన్‌తో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా జారీ చేసారు. కానీ 2010లో సెటిల్‌మెంట్ పట్టాలను అప్పటి కలెక్టర్ రద్దు చేసారు. దీంతో సెటిల్‌మెంట్ భూములలో రిజిస్ట్రేషన్ లావాదేవీలు ఆగిపోయాయి. స్వర్ణముఖి నదీపరివాహక ప్రాంతంలో చిగురువాడ గ్రామ పంచాయతిలోని పలుకాలనీల ప్రజలు ఆక్రమణ చేసే ప్రయత్నం చేసారు. ఆక్రమణను రెవెన్యూ, పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేస్తే, చర్యలు తప్పవని తిరుపతిరూరల్ సి.ఐ. హెచ్చరించారు. ఇళ్లు లేని నిజమైన లబ్దిదారులు ఆథార్, రేషన్‌కార్డులు గ్రామ సచివాలయాల్లో ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రమేష్, పెద్దఎత్తున పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నాగూరు కాలనీ రంజాన్ వేడుకలలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



***తిరుపతిరూరల్, మార్చి31 ప్రభాతవార్త:*** పండగలు మన జీవన స్రవంతిలో భాగమై, మన జాతీయతకు సంస్కృతి వికాసానికి దోహదం చేస్తాయి. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరపుకునే రంజాన్ పండగ వేడుకలలో చంద్రగిరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. సోమవారం తిరుపతిరూరల్ కుంట్రపాకం గ్రామ పంచాయతీ పరిధిలోని నాగూరుకాలనీలో మసీదులో ముస్లిం పెద్దలతో కలిసి మోహిత్‌రెడ్డి ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ఈ కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండగను విశిష్టంగా జరుపుకుంటారని, 30రోజుల పాటు ఉపవాస దీక్షలో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరిమల్ల వల్లీ, గుడూరు రఫీ, వేంపల్లి రాజేంద్ర, చిన్నబాబు, తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షులు విదుదల మాధవరెడ్డి, వేముల యశోధ, కుంట్రపాకం సర్పంచ్ శుభపద్మనాభరెడ్డి, తనపల్లి సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

**బుచ్చినాయుడు కండ్రిగ, మార్చి 31 ప్రభాతవార్త:**
రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు పిల్లలు, పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సుమారు 30 రోజుల పాటు రంజాన్ ఉపవాసాన్ని స్వీకరించిన ముస్లిం సోదరులకు ఈ ఏడాదంతా మంచే జరగాలని కోరారు. ప్రేమ, దయ, సహనం, సంతోషాల కలయికే రంజాన్ పర్వదినం ముస్లిం పెద్దలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు, హిందువులు కలసి శుభాకాంక్షలు తెలుపుకుని ఐక్యతను చాటుకున్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

**వడమాలపేట, మార్చి 31 ప్రభాతవార్త:**



రంజాన్ పండుగను వడమాలపేట మండలంలోని ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నెల రోజులు ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు ఉదయం మసీదుకు వెళ్లి నమాజ్ చేశారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిత్రులకు, స్నేహితులుకు విందు భోజనం ఏర్పాటు చేశారు. రంజాన్ పండుగ పూడి గ్రామంలోని మసీదు వద్ద అందరూ గుమికూడి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. రంజాన్ విశిష్టతను, ప్రత్యేకతను వివరించి అందరికి మంచి జరగాలని ప్రార్ధనలు చేశారు. ముత్తవల్లి బాబు సాహెబ్ ఆధ్వర్యంలో వడమాలపేట, చింతకాల్వ, వెంగళరాజుకండ్రిగ, పచ్చికాల్వ, పూడి, బాలినాయుడు కండ్రిగ గ్రామాల్లోని ముస్లింలు పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## వేపేరిలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**వెదురుకుప్పం, మార్చి 31 ప్రభాతవార్త :**



వేపేరిలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా జరపుకున్నారు. మండలంలోని నల్లవెంగనపల్లె పంచాయితీ పరిధిలోని వేపేరి గ్రామంలో ముస్లీం సోదరులు రంజాన్ పర్వదినం పురష్కరించుకుని వేకువజామ నిద్ర లేచి స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి మసీదు వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. నెల రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాసదీక్షలు చేపట్టిన ముస్లీం సోదరులు నెలవంక దర్శనంతో దీక్షలు విరమించి. శుభాకాంక్షలు తెలుపుకుని వాడవాడల రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని పచ్చికాపల్లం, తాటిమాకులపల్లె, పాతగుంట గ్రామాల్లో ఈద్గాకు చేరుకుని ఆలింగనం చేసుకుని ప్రార్ధనలు చేశారు. మాజీ మార్కెటింగ్ కమిటీ సభ్యులు గపూర్, పెద్ద సంఖ్యలో ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

## అల్లాహు అక్బర్...

**రేణిగుంట మార్చి 31 ప్రభాతవార్త**



రేణిగుంట మండలంలోని రేణిగుంట పట్టణం, మామండూరు, గురవరాజు పల్లె గ్రామాలు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం అల్లాహ్ హు అక్బర్ నామస్మరణతో మారుమోగాయి. హిందూ ముస్లిం భాయి భాయి అంటూ మతాలకు అతీతంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రేణిగుంట పట్టణంలోని అన్ని మసీదులకు చెందిన ముస్లింలు రేణిగుంట పెద్ద మసీదు చేరుకున్నారు. అక్కడనుండి పలు మసీదుల ముత్తవల్లీలు, ముస్లిం పెద్దలతో కలిసి అల్లా పవిత్ర నామం అల్లాహూ అక్బర్ అని స్మరించుకుంటూ ఈద్గా మైదానం చేరుకున్నారు. మైదానంలో ఏర్పాటుచేసిన చావిళ్ళ కింద మత పెద్దలు ప్రవచించిన అల్లా సందేశాన్ని భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో విన్నారు. అనంతరం నమాజు చేసి పేదలకు తమకు తోచిన ధన, వస్త్ర, అన్నదానాలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు మునీర్ జీకే, మహబూబ్ బాషా అఫ్రోజ్, రఫీ ఉల్లా, సైకిల్ షాప్ అలీ, పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## అన్నదానం

**తిరుపతి హెల్త్, మార్చి 31 ప్రభాతవార్త ః**



బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీజీ కృష్ణయాదవ్ బైరాగిపట్టెడలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యాలయం ఎదురుగా ఉన్న మాతృశ్రీ అనాధాశ్రమంలో పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

# పోలేరమ్మ ఆలయ అభివృద్ధి సహకరించండి : నెలవల



నాయుడుపేట మార్చి 31 ప్రభాతవార్త : పట్టణంలోని గడియారం సెంటరులో ఉన్న పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి అందరు కలిసి సహకరిచాలని సూళ్ళూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం కోరారు.ఆయన ఆధ్వర్యంలో సోమవారం గడియారం సెంటరు వద్ద గ్రామపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా నెలవల సుబ్రమణ్యం మాట్లడుతూ పోలేరమ్మ ఆలయ అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలని పిలునిచ్చారు. మే నెల 3,4,5 తేదిల్లో నిర్వహించే పోలేరమ్మ జాతరను అందరు కలిసి జయప్రదం చేయాలన్నారు. నాయుడుపేట గడియారం సెంటరులో ట్రాపిక్‌కు అంతరాయం లేకుండా పోలేరమ్మ ఆలయాన్ని కొంచెం వెనుకకు జరిపి అభివృద్ధి చేసేందుకు పూజార్లు, ఆగమ శాస్త్రవేత్తలతో చర్చించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంద న్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఏఎమ్‌సి చేర్మెన్ శిరసనంబేటి విజయభాస్కరెడ్డి, ఎస్ చంద్రారెడ్డి, మైలారీ రాజశేఖర్, పసల గంగాప్రసాద్, చెంచ్చయ్య, గోపి తదితరులు ఉన్నారు.

## తడలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

తడ, మార్చి 31 ప్రభాతవార్త: తడ మరడలంలోని పలు గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో రంజాన్ పర్వదినాన్ని జరుపుకున్నారు. తడ, తడకండ్రిగ, పూడి, భీముల వారిపాలెం తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మొదటిరోజు ఉగాది, రెండోరోజు రంజాన్ వరుసగా రావడంతో హిందూ ముస్లిం భాయ్‌భాయ్ అంటూ గత రెండురోజులుగా ఒకరినొకరు అభినందించుకుంటూ పండుగలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని వేనాడు దీవిలో ఉన్న చారిత్ర అల్లాతాత దర్గా సమాధి వద్ద ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి దర్గా వద్ద నిద్ర చేసిన వారు సోమవారం ప్రార్ధనలు చేసుకొని తిరిగి వెళ్లారు.

## కోటలో ఘనంగా రంజాన్ వేడుకలు



కోట, మార్చి 31 ప్రభాతవార్త : కోట మండలంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు ఈద్గా వద్ద ప్రార్ధనలు చేశారు. నెలరోజుల పాటు ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. అనంతరం అల్లాహ్ కరుణ కోరుతూ ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. కోట, విద్యానగర్, చిట్టేడు తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రార్ధనలు చేశారు. కోటలోని ఈద్గా వద్ద మతపెద్దలు అందరికీ మంచి జరగాలంటూ సందేశమిచ్చారు. కోటలోని జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ విందు ఏర్పాటు చేశారు.

## వైభవంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం



కోట, మార్చి 31 ప్రభాతవార్త : మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కరించుకొని శ్రీనివాస శాంతి కల్యాణ మహోత్స వం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు నేదురు మల్లి ప్రసేన్‌కుమార్‌రెడ్డి, మైథిలి దంపతులు కన్యాదాతలుగా, ఉభయకర్తలుగా వ్యవహరించారు. జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దివి అనంతచార్యులు శ్రీవైకానస ఆగమోక్తంగా కల్యాణ క్రతువులోని ప్రతి సందర్భాన్ని వివరిస్తూ గోవింద నామస్మరణతో శ్రీనివాస కల్యాణ మహోత్స వం భక్తుల ఆనందోత్సాహాల నడుమ భక్తి పారవశ్యంతో జరిపించారు. కల్యాణ మహోత్సవంలో ఆలయ అర్చకులు చలపతి స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాముల వారి ఆలయం ప్రారంభం

**- పూజ నిర్వహించిన ఎమ్మెల్యే రామకృష్ణ**



వెంకటగిరి, మార్చి 31 ప్రభాతవార్త : పట్టణంలోనే పెరియవరం వద్ద నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి ఆలయం ప్రారంభోత్స వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రామకృష్ణకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో రామాలయాన్ని నూతనంగా నిర్మించి కలిసి పూజలు నిర్వహించారు. కలిశాలకు నిర్వహించిన హోమం కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఘనంగా రాములవారి మందిరం ప్రారంభోత్స వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె.ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, జనసేన నాయకుడు చిరంజీవి, టిడిపి నాయకులు ఆనంద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే



వెంకటగిరి, మార్చి 31 ప్రభాతవార్త : ఈద్గా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని ఈద్గాలో జరుగుతున్న రంజాన్ ప్రార్ధనలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈద్గా చుట్టూరు ప్రహరీ గోడ నిర్మిస్తానని, ఈద్గా మొత్తం సిమెంట్ తో కాంక్రీట్ నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈద్గాను అభివృద్ధి చేస్తానని చెప్పారు. ముస్లింల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం లో ముస్లిం నాయకులు గౌస్ బాషా, కరిముల్లా, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె.వి.కె.ప్రసాద్ నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, నాయకులు పాల్గొన్నారు

## పేటలో ఘనంగా రంజాన్ వేడుకలు

నాయుడుపేట, మార్చి 31 ప్రభాతవార _: పట్టణం,మండలంలోని పలుగ్రామాల్లో ముస్లీమ్ సోదరులు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రంజాన్ పర్వదినంను పురుష్కరించుకొని ముస్లిం సోదరు కొత్తబట్టలు ధరించి ఒకరినొకరు పలకరించుకొంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. రంజాన్ సందర్బంగా మసీదుల్లో ముస్లీమ్ సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టారు

# గణపయ్య ఏకాంత సేవకు...వెండి ఉయ్యాల విరాళం



కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు ఓ భక్తుడు స్వామివారి ఏకాంతసేవ(పవళింపు) కోసం సుమారు 8 లక్షల రూపాయల విలువగల వెండి ఉయ్యాలను సోమవారం విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన రాధికా హరికృష్ణ దంపతులు సుమారు 7.5 కిలోల వెండితో 8 లక్షలు రూపాయలు వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన ఉయ్యాలను ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈఉయ్యాలను ఆలయ ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. ప్రతి రోజూ ఆలయం మూసి వేసే సమయంలో స్వామివారికి అద్దాల మండపంలో ఏకా ంత సేవను నిర్వహిస్తుంటారు. ఇదిలా వుండగా భక్తులు అందించిన వెండి ఉయ్యాలను పుష్పాలతో అలంకరించి అద్దాల మండపంలో స్వామివారికి ఊంజల్‌సేవను నిర్వహించారు. అలాగే దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు,. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఆలయ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, సూపరెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో... మల్రిగుంట,పెద్ద చెరువులు

**- ప్లాట్‌గా మారిన,మారుతున్న రెండు చెరువులు - మామూళ్ళ మత్తు, నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు**
**- సీఎం, డెప్యూటీ సీఎం,మంత్రి లోకేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ స్పందించాలని బాధిత గ్రామ ప్రజలు విజ్ఞప్తి**

తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త : రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి మల్రిగుంట, పెద్ద చెరువులు వెళ్ళాయని, రెండు చెరువులు కూడా ఫ్లాట్‌గా మారుతున్నా, నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు ఉన్నారని, సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌బాబు, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెంటనే స్పందించి దళితులు అయిన తమకు న్యాయ చేయాలని బాధిత మాధవగిరి గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు నేడు, రేపో కలెక్టర్‌ను కలిసి మండల రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామ ప్రజలు వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బాధిత మాధవగిరి పల్లె గ్రామ ప్రజలు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాల్లోకి వెళితే...శ్రీకాళహస్తి మండలం, గోవిందురాజు పల్లె పంచాయితీ, ఇలగనూరు గ్రామ లెక్క దాఖలా సర్వే నెం.321 మల్రిగుంట చెరువు, సర్వే నెంబర్లు 374, 375, 383, 384, 327, 405, 365, 310, 311, 371, 370,405,404లు ఏర్పేడు- వెంకటగిరి నేషనల్ హైవేకి ఆనుకుని ఉన్న మల్రిగుంట, పెద్ద చెరువులు రెండూ కూడా ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారుల కోరల్లో దాదాపు 20 ఎకరాలు మల్రిగుంట చెరువు, పెద్ద చెరువు ప్రభుత్వ భూములు చిక్కుకుని ఉన్నాయంటే ఆశ్చర్య పడాల్సిన అవసరం లేదు. ఈ రెండు చెరువుల క్రింద దాదాపు 300 ఎకరాలు సాగు రైతులు విస్తీర్ణం ఉంది. ఈ భూకబ్జాదారుల వెనుక గత శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే హస్తంకూడా ఉందని మాధవగిరిపల్లె గ్రామ ప్రజలు, స్థానిక ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాత, ముత్తాతల నుంచి రెండు చెరువుల ఉనికిని కాపాడుకుంటూ. ఆ రెండు చెరువుల చుట్టు ప్రక్కల పశువులు మేపుకుంటూ పేదలకు ఇచ్చిన భూముల్లో పైరు పంటలు వేసుకుని జీవనం చేసుకుంటూ బ్రతుకుతున్నామని మాధవగిరిపల్లె గ్రామ ప్రజలు, చుట్టు పక్క గ్రామాల ప్రజలు, స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్న వాదనలు. తమకు చెందాల్సి న గ్రామ ప్రజల ఆధీనంలో ఉన్న డీకేటీ భూములను సైతం భూ కబ్జాదారులు ఆక్రమించుకుని రెండు చెరువులను సైతం పూడ్చుకుంటూ ఫ్లాట్‌గా వేసి అమ్ముకోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదు చేసినా ఆర్‌ఎస్ టిపిటి 202412123761 నెంబరుతో నమోదు అయిన ఫిర్యాదు దారుల సమస్యను పరిష్కరించామని మెస్సెజ్ రావడం విడ్డూరంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా పలు పర్యాయాలు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరువైయ్యా రని, ప్రశ్నించే వారిపై దాడులకు దిగిన సంఘటనలు లేకపోలేదని వారు గుర్తు చేశారు. భూ కబ్జాదారుల కోరల్లో చిక్కుకుని ఉన్న మల్రిగుంట, పెద్ద చెరువుల రెండు చెరువులకు సంబంధించి ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, తమ కుటుంబాలకు పట్టాలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత మాధవగిరి గ్రామ ప్రజలు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌బాబు, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెంటనే స్పందించి మామూళ్ళ మత్తు, నిద్రావస్థలో ఉన్న మండల రెవెన్యూ అధికారులను మేల్కొపి తమకు న్యాయం చేయాలని వారు కోరుకుంటున్నారు. లేని పక్షంలో రాష్ట్రంలోని అన్ని దళిత సంఘాల మద్దతు కూటగట్టుకుని మండల, డివిజన్, జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపడతామని మాధవ గిరి గ్రామ ప్రజలు,దళితులు, స్థానికులు హెచ్చరిస్తున్నారు.



-కబ్జాకు గురైన, గురవుతున్న మల్రిగుంట, పెద్ద చెరువులు

# సిఎం చంద్రబాబు, నారా భువనమ్మ...ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు!



కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త : ఎనిమిది సార్లు వరుసగా కుప్పం నుంచి గెలిపిస్తూ వస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునే దిశగా సిఎం చంద్రబాబునాయుడు, సిఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ముందుకుసాగుతున్నారు. సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం ద్వారా, మరో పక్క సిఎం సతీమణి భువనమ్మ సైతం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా కుప్పం ప్రజలకు అండగా నిలుస్తున్నారు. రాష్ట్రంలోనే చిట్టచివరి నియోజకవర్గం అయిన కుప్పానికి ఇప్పటికే దేశ విదేశాల్లో గుర్తింపు తెచ్చిన సిఎం చంద్రబాబునాయుడు ఈ ఐదేళ్లల్లో కుప్పాన్ని దేశంలోనే ఓ మోడల్ నియోజక వర్గంగా మలచాలని నిర్ణయించారు. అందుకు తగినట్లుగా ఆయన కుప్పం విజన్ 2029ను అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే కుప్పాన్ని సమగ్ర అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టారు.కుప్పం మున్సిపాలిటీని మోడల్‌గా మలచేందుకు సింగపూర్ దేశస్తులతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. మున్సిపాలిటీకి ఇదివరకే 92.50కోట్ల నిధులు మంజూరు చేసిన విషయం విదితమే. మరో పక్క అంతే వేగంగా అభివృద్ధికి నిదర్శనంగా నిలిచే గ్రామాల అభివృద్ధిపై సైతం సిఎం చంద్రబాబు దృష్టి పెట్టారు. కుప్పంలో తొలివిడత 30కోట్లతో సిసి రోడ్లు నిర్మించగా మరో 52.25కోట్లతో ఆర్‌అండ్‌బి రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. గ్రామాల్లో పాడి రైతుల కోసం ఇప్పటికే 500గోకులం షెడ్లు మంజూరు చేయగా అదనంగా మరో 1000 షెడ్లు మంజూరు చేయనున్నారు. తాగు,సాగునీటి అవసరాల కోసం హంద్రీ-నీవా కాలువల పనులు వేగవంతం చేశారు. మరో పక్క గండికోట నుంచి తాగునీటి పైపులైను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీంతో పాటు నియోజకవర్గంలో ఉన్న ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. ఇక కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)ద్వారా చిరువ్యాపారాలు చేసే మహిళలకు ఇ -సైకిళ్లు పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులకు ఇజి మార్ట్, చిన్నపిల్లల ఆరోగ్యంకోసం కేర్ అండ్‌గ్రో, మహిళలను పారిశ్రామికవేత్తలుగా మలచేందుకు అలీప్ సంస్థతో ఒప్పందాలు జరిగాయి.

**ఎన్టీఆర్ ట్రస్ట్‌తో పేదలకు అండ :**

నియోజకవర్గ ప్రజలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అండగా నిలుస్తున్నారు. కుప్పంలో ఏడాదిన్నర క్రితమే ఎన్టీఆర్ ఆరోగ్య సంజీవని క్లినిక్ ద్వారా కుప్పం ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. మరో పక్క ఎన్టీఆర్ ఆరోగ్య రథాన్ని సైతం అందుబాటులో తెచ్చారు. ఇక మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో నారా భువనమ్మ కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేశారు. ఇక్కడ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ, జ్యూట్ బ్యాగుల తయారీ, పట్టుదారంతో గాజుల తయారీ, చికెన్‌కారీ ఎంబ్రాయిడరీ శిక్షణ ఇస్తున్నారు. త్వరలోనే కుప్పంలో బ్యూటీషియన్, మగ్గం కోర్సులు ప్రారంభించనున్నారు. కుట్టుశిక్షణ పొందిన మహిళలకు ఉచితంగా ట్రస్ట్ తరపున కుట్టుమిషన్లను నారా భువనమ్మ పంపిణీ చేస్తున్నారు. అవసరమైన దివ్యాంగులకు ట్రస్ట్ ద్వారా ట్రైసైకిళ్లను అందిస్తూ కుప్పం ప్రాంత ప్రజలకు ఇతోధిక సాయాన్ని భువనమ్మ చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో దత్తత తీసుకున్న పైపాళ్యం, కంచిబందార్లపల్లి గ్రామాల అభివృద్ధికి చొరవ చూపుతున్నారు.

# గూడూరు డివిజన్

## భక్తిశ్రద్ధలతో దీవెనలు పొందాలి



వాకాడు, మార్చి 31 ప్రభాతవార్త : ముస్లింలు పవిత్రంగా భావించె రంజాన్ మాసంలో ఆచరించే ఉపవాస దీక్ష లకు అల్లా దీవెనలు పొందుతారని మత గురువులు అన్నారు. సోమవారం మండలంలోని వాకాడు, సిద్దిగుంట పాలెం, నెల్లిపూడి, తిరుమూరు, దుగ్గరాజపట్నం, నవాబ్ పేట గ్రామాల మసీదులలో భక్తి శ్రద్దలతో ముస్లిం సోదరులు ప్రార్థనలను నిర్వహించారు. పలుచోట్ల మసీదులలో మత గురువులు ఖురాన్ గ్రంథం ద్వారా గొప్పతనం గురించి వచ్చినటువంటి ముస్లిం సోదరులకు క్షుణ్ణంగా వివరించారు. రంజాన్ మాసం వరాలను దోచుకునే పవిత్ర మాసమని మత గురువు ముస్లిం సోదరులకు వివరించాడు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికి ఒకరు ఆలింగం చేసుకున్నారు.

## తల్లిదండ్రులపై దాడిచేసిన కొడుకు, కోడలిపై కేసు నమోదు



ఎ.కొత్తకోట(చౌడేపల్లి), మార్చి 31 ప్రభాతవార్త: తల్లిదండ్రులపై దాడిచేసి గాయపరచిన కొడుకు, కోడలిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం మేరకు...మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోటకు చెందిన వృద్ధ దంపతులు చిన్నరెడ్డెప్ప(85), రాజమ్మ(78)లపై వారి కుమారుడు మనోహర్‌రెడ్డి, కోడలు సరస్వతమ్మలు దాడిచేసి గాయపరచారు. తల్లి రాజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. కాగా కొడుకు దాడిలో తండ్రికి నడుము విరిగింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

## గణనాధునికి ఘనంగా గ్రామోత్సవం



కాణిపాకం, మార్చి 31 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా ఆదివారం రాత్రి స్వామివారికి ఘనంగా గ్రామోత్స వం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వేలూరుకు చెందిన రాధాకృష్ణ కుటుంభీకులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఈమేరకు వీరు వరుస ఉభయం తీసుకురాగా స్వామి, అమ్మవార్ల ఉత్స వ మూర్తులను ఆలయ అలంకార మండపంలో వుంచి అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం స్వామివారి అమ్మవార్ల ఉత్స మూర్తులను ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి,వాసు, టెంపుల్ ఇన్స్ పెక్టర్‌లు బాలాజినాయుడు, రవి వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## తెలుగునూతన సంవత్సరం అంతా మంచి జరగాలి

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి: తెలుగునూతన సంవత్స రంలో జిల్లా ప్రజలకు అంతా మంచి జరగాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం ఆయన విఐపి బ్రేక్‌లో దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## డాక్టర్ జగదీష్‌కు విశ్వవైద్య దివ్యాంగబంధు అవార్డు



తిరుతి హెల్త్, మార్చి 31 ప్రభాతవార్త : మారిషస్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ తెలుగు ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఫినక్స్‌లో ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్‌లో తెలుగు నూతన సంవత్స రాన్ని పురస్కరించుకుని ఉగాది సంబరాలు తెలుగు వారు ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత వైద్య నిపుణడు డాక్టర్ గుడూరు జగదీష్ వైద్య రంగంలో చేసిన అసాధారణ కృషికి ముఖ్యంగా వికలాంగుల శ్రేయస్సు కోసం వారి యొక్క అచంచలమైన అంకిత భావానికి గుర్తింపుగా మారిషస్ ప్రధాన మంత్రి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ సేవలను మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్ చంద్ర రామ్ గూలమ్ కొనియాడారు. ఏపీలో ఒక సాధారణ కుటుంబలో పుట్టిన డాక్టర్ జగదీష్ ప్రపంచ నలు దిశలా పేరు ప్రఖ్యాతలు సంపాదించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మారిషస్ కూడా డాక్టర్ జగదీష్ సేవలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు వారి కళాత్మక వారసత్వాన్ని ప్రతిభింబించే నృత్యాలు, జానపద పాటలు, సాంప్రదాయ సంగీతంతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.

## గంగమ్మ ఆలయ ఛైర్మన్ పగ్గాలు బిఎంకె కేనా?



కుప్పం, మార్చి 31 ప్రభాతవార్త : జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ ఆలయ కమిటీ ఛైర్మన్‌గా ఇదివరకు ఓ దఫా ఛైర్మన్‌గా పనిచేసిన బిఎంకె రవిచంద్రబాబుకు ఖరారైనట్లు సమాచారం. ఆయనతో పాటు మరో పది మంది సభ్యులను కమిటీలో నియమించనున్నట్లు తెలిసింది. కాగా బిఎంకె రవిచంద్రబాబు సిఎం చంద్రబాబునాయుడు ఆశీస్సులతో వైఎస్సార్సీ పాలనలోనే కుప్పంలో అన్న క్యా ంటీన్‌ను ముందరుండి నడిపించి రోజూ మధ్యాహ్నం పేదలకు మధ్యాహ్న భోజనం అందించేవారు. దాదాపు రెండేళ్లపాటు ఆయన క్యాంటీన్‌ను నడిపించారు. కుప్పంలో వైఎస్సార్సీ నేతలు అన్నక్యాంటీన్‌పై అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా దాడి చేశారు. ఈదాడిలో బిఎంకె రవిచంద్రకు సైతం గాయాలయ్యాయి. అయితే కూడా వైకాపా నేతల బెదిరింపులకు తలొగ్గక నిరాట ంకంగా అన్నక్యాంటీన్ కొనసాగిం చారు. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబునాయుడు అధికారంలో రాగానే శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ ఛైర్మన్ పదవి బిఎంకె రవిచంద్రకే కట్టబెట్టాలని నిర్ణయించారు. రేపో మాపో ఆలయ కమిటీని దేవదాయ శాఖ అధికారికంగా ప్రకటించనుంది.

## వాయులింగేశ్వరుని దర్శనం కోసం జనం జాతర



శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయానికి రెండు రోజులుగా భక్తులు కడలి తరంగాల్లా కదలి వస్తున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం ఆలయం భక్తులతో కిక్కిరిసింది, ఎటు చూసినా భక్త జనమే, వాహనాల రద్దీయే కనబడింది. వరుస సెలవులతో జిల్లాలోని ఆలయాలు కిట కిట లాడుతున్నాయి.

**భక్తుల దోపిడి మారటం లేదు:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే సామన్య భక్తులు బస కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతంగా మారింది.ఇక్కడ రద్దీ రోజుల్లో గదులు వేలరూపాయలు పలుకుతుంటే వచ్చిన సామన్య భక్తులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితి చోటు చేసుకుంటుంది.దేవస్థానంకు సంబంధించిన గదులు పరిమితంగా ఉన్నాయి. వాటికి సంబంధించి కూడా సమాచారం లేదు. దాంతో ఆటోల డ్రైవర్ల ఇష్టారాజ్యంగా మారింది. లాడ్జిల యజమానులతో కాంటాక్టు పెట్టుకొని నిలువునా దోచుకుంటున్నారు. భక్తుల నుంచి దోచుకుంటున్న సొమ్మును లాడ్జిల యజమానులు సగం,ఆటోల డ్రైవర్లు సగం అంటూ పంచుకుంటూ నిలువు దోపిడి చేస్తున్నారు. భక్తుల ఆవేదనను పట్టించుకునే దిక్కు లేదు. ఇక వచ్చిన వారికి తిండి కోసం ఉన్న కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లులో కనీసం అల్పాహారం కూడా దొరక్క తిప్పలు పడ్డారు.కనీసం టీ కూడా దొరకని స్థితి. ఆలయానికి వచ్చే భక్తులకు కృష్ణారెడ్డి మండపంలో సమాచారం అందించి అక్కడే సెంట్రల్ రిసెప్షెన్‌ను ఏర్పాటు చేస్తే కొంత వరకు ప్రైవేటు దోపిడి నుంచి భక్తుల్ని కాపాడిన వారౌతారు.అధికారులు అందించిన సమాచారం మేరకు సోమవారం సుమారు25వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.రాహుకేతుదోష నివారణ పూజలు కూడా గణనీయంగా జరిగాయి. ఆలయాదధికారులు అందించిన సమాచారం మేరకు 5763మంది భక్తులు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ప్రత్యక దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 8వేల మంది ఉన్నారు.